నెరవేరిన దశాబ్దాల కల


- ధర్మవరం ఆర్‌యూబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రూ.8.33 కోట్ల నిధులు విడుదల చేస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వుల జారీ
- తీరనున్న ఇక్కట్లు

గుంతకల్లు: పట్టణ ప్రజలకు రైల్వే బోర్డు శుభవార్త చెప్పింది. ఎన్నో ఏళ్లగా వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ధర్మవరం రైల్వే గేట్‌ను (ఎల్‌సీ గేట్) తొలగించేందుకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. అంతేకాకుండా రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణానికి రూ.8.33 కోట్ల నిధులు విడుదల చేస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. గుంతకల్లు పట్టణంలోని భాగ్యనగర్, పోర్టర్ లైన్, మస్తాన్‌పేట్, అలూరు రోడ్డులోని వివిధ కాలనీవాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కానుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.8.33 కోట్లతో పనులు

గుంతకల్లు–కల్లూరు సెక్షన్‌లోని గుంతకల్లు–గూళ్యపాళ్యం స్టేషన్ల మధ్య ఉన్న పట్టణంలోని ధర్మవరం రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ (కి.మీ. 278/5–6, ఎల్‌సీ గేట్ నం.157) వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం చేపట్టేందుకు రూ.8.33 కోట్లు విడుదల చేస్తూ రైల్వే బోర్డు ఫైనాన్స్ డైరెక్టరేట్ మినిస్టర్ కార్యాలయం నుంచి సంజేయ్‌కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.





ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్ మూసివేయడంతో ఆగిన వాహనదారులు (ఫైల్), ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

ఎల్‌సీ గేట్‌ను తొలగించి.. దాని స్థానంలో ధర్మవరం గేట్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా రెండు మార్గాలు (ఇన్ అప్) రూపంలో ఆర్‌యూబీ ఏర్పాటు చేస్తారు. ఆర్‌యూబీ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ఆర్‌యూబీ నిర్మాణంతో రోడ్డుకు ఇరువువైపులా ఇళ్లు కోల్పోయే వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేందకు సిద్ధంగా ఉంది. వారికి సంతృప్తి స్థాయిలో న్యాయం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

దశబ్దాల కాలంగా ధర్మవరం రైల్వే గేట్ లెవల్ క్రాసింగ్ గేట్‌తో భాగ్యనగర్, పోర్టర్‌లైన్, మస్తాన్‌పేట్, శాంతినగర్, ఆలూరు రోడ్డు ప్రాంత వాసులు నిత్యం తీవ్ర ఒత్తిడికి గురువుతున్నారు. ఈ రైలు మార్గంలో నిత్యం గూడ్స్‌రైళ్లతో పాటు ప్యాసింజర్ రైళ్లు దాదాపు 50 పైగా రాకపోకలు సాగిస్తున్నాయి. రైళ్ల రాకపోకల సమయంలో ఎల్‌సీ గేట్ వేయడంతో వాహనదారులు కనీసం 15 నుంచి 20 నిమిషాలు వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో కొన్ని నిమిషాల్లోనే వందల సంఖ్యలో రైల్వేగేట్‌కు ఇరువైపులా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇతరత్రా వాహనాలు ఆగిపోయేవి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఈ ఎల్‌సీ గేట్‌తో ప్రజలు పడుతున్న ఇబ్బందులను డీఆర్ఎంలు, రైల్వే ఉన్నతధికారులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి వివరించారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేశారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం



ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్ తొలగించడం ద్వారా అటువైపుగా ఉన్న ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. రోజు రోజుకు పెరుగుతున్న జనాభా అనుగుణంగా పట్టణాభివృద్ధి చెందాలన్నదే నా ఆకాంక్ష. ప్రస్తుతం ధర్మవరం గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం అనంతరం కసాపురం రైల్వే మోరీ విస్తరణ, హనుమన్ సర్కిల్‌లోని మరో రైల్వే ఎల్‌సీ గేట్ తొలగింపుపై రైల్వే ఉన్నతధికారుల వద్ద ఫైల్స్ సిద్ధంగా ఉన్నాయి. వాటికి కూడా త్వరలోనే అనుమతులు లభిస్తాయని ఆశిస్తున్నాం.
– వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే,గుంతకల్లు

క్లుప్తంగా

చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తిని త్వరలోనే చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవి కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా లీగ్ 2.0, సఫాయ్ మిత్ర సురక్ష షివిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త రహిత, మురికి రహిత మున్సిపాలిటీగా మార్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల సహకారం, పాలకవర్గం తోడ్పాటుతో త్వరలోనే చెత్త రహిత మున్సిపాలిటీగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలను అరికట్టండి



సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టి, నీటి వృథాను నివారించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వాటర్‌వర్క్స్ సిబ్బంది మస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఒక్క రోజు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పైప్‌లైన్ లీకేజీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పట్టణంలో ఎక్కడా కలుషిత నీటి సరఫరా అవుతుందన్న ఫిర్యాదుల్లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, డీఈ రామ్మూర్తి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులు

యాడికి: ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాల నుంచి గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి పరిసరాల శుభ్రతపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 37 గ్రామాల్లోనూ గ్రామస్తులందరూ ఇళ్లు, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇలా చేయడం వలన దోమలు తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కాశెప్ప, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు చేయూత అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

గుంతకల్లుటౌన్: సంప్రదాయ చేతివృత్తుల వారికి చేయూతనందించి, జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేయనున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. సోమవారం నామా లసేట్ ఫంక్షన్ హాల్‌లో పీఎం విశ్వకర్మ యోజన పథకంపై ఆయా చేతివృత్తుల వారికి అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన 18 కులాలకు చెందిన చేతివృత్తుల వారికి శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందన్నారు. మొదటి విడతగా కేవలం 5 శాతం వడ్డీతో ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.లక్ష రుణ సదుపాయం అందజేస్తామన్నారు. మొదటి విడత కింద రూ.13 వేల కోట్లను వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు లలిత్‌కుమార్, రామాంజనేయులు, అసెంబ్లీ కన్వీనర్ విశ్వనాథ్, పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్ర, ఓబీసీమోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: మానసిక స్థితి సరిగా లేని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన వివరాలు.. శ్రీనివాసపురానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, హేమావతి (42) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. అయితే హేమావతి మానసిక పరిస్థితి బాగోలేక పోవడంతో భర్త ప్రతాప్‌రెడ్డి కర్నూలు, హైదరాబాద్‌లో పలు మార్లు చికిత్సలు చేయించినా ఫలితం లేకపోయింది. మానసిక జబ్బు నయం కాదని మనస్తాపానికి గురైన హేమావతి ఆదివారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

స్పందనలో ఒకే ఒక్కరు



స్పందనకు హాజరైన తహసీల్దార్ నాగభూషణ, మిగతా కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం మండలంలో నిర్వీర్యం అవుతోంది. గత కొన్ని నెలలుగా మండల స్థాయి అధికారులు స్పందన కార్యక్రమానికి సక్రమంగా హాజరు కావడం లేదు. సోమవారం నిర్వహించిన స్పందనకు తహసీల్దార్ నాగభూషణ హాజరయ్యారు. మిగతా ఉద్యోగులు హాజరుకాక పోవడంతో ఆయనే అర్జీలు స్వీకరించారు. స్పందనకు హాజరుకావాలని నిబంధనలు ఉన్నా సక్రమంగా రావడం లేదని తహసీల్దార్ తెలిపారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

పెద్దపప్పూరు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అత్తిరాల దిన్నె, పెండేకల్లు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. 2014 ఎన్నికల్లో జగనన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య), మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, ఎంపీటీసీ నాగవేణి, కో–ఆప్షన్ సభ్యుడు హాజీవలి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథ రెడ్డి, నామనాంకపల్లి రఘునాథ రెడ్డి, చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, స్థానిక నేతలు, వాసుదేవరెడ్డి, నాగలింగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 27వ వార్డులో యువ నాయకుడి పర్యటన

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని 27వ వార్డులో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సీబీ రోడ్డులోని రామచంద్ర లాడ్జి నుండి నిర్వహించే ఈ పర్యటనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా జాతీయ సేవా దినోత్సవం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (ఎన్ఎస్ఎస్) జాతీయ సేవా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారులు శివప్రసాద్, నాగమణి మాట్లాడుతూ.. విద్యార్థులు సేవాధృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పామిడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. కళాశాల ప్రాంగంలోని చెత్తా చెదారం, కంపచెట్లను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి బి.వెంకట నారాయణరెడ్డి, ఉపన్యాసకుడు అక్కులన్న, పీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

30న తలనీలాల బహిరంగ వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఈనెల 30న తలనీలాలు పోగుచేసుకును హక్కుల కోసం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాఘ మాసం మినహా విడిదినాల్లో మాత్రమే తలనీలాలను పోగుచేసుకోవచ్చని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

అధునాతన పద్ధతిలో రీ సర్వే

యాడికి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్షతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ అలెగ్జాండర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. మండలంలో తిమ్మాపురంలో భూముల రీ సర్వే పూర్తి కావడంతో 113 మందికి భూ హక్కు పత్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. సోమవారం వేములపాడు సచివాలయంలో సర్పంచ్ ఓంకారమ్మ అధ్యక్షతన భూహక్కు పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ సమస్యలను శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రాజ్‌కుమార్, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, వీఆర్వో రామాంజనేయులు, యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివుడు, ప్రసాద్ రెడ్డి, రామానందరెడ్డి, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



వేములపాడు సచివాలయంలో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్లూరు: అరకటివేముల గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష కార్యక్రమం కింద రీ సర్వే పూర్తయిన రైతులకు భూహక్కు పత్రాలను తహసీల్దార్ మోహన్‌కుమార్ సోమవారం పంపిణీ చేశారు. అధునాతన పద్ధతిలో రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వే వల్ల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 291 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న కమాండెంట్ గంగాధర్ రావు

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి ఇన్సిడెంటల్ చార్జస్ కింద రూ.25 వేల చెక్కును మృతుడి భార్య దీపికకు బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని వెల్లడించారు. ఉదయ్ భాస్కర్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కారుణ్య నియామకం కింద ఉదయ్ భాస్కర్ భార్యకు ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఏఓ నాగభూషణమ్మ, బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

శింగనమల: బుక్కరాయసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం అండర్–14, అండర్–17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీలు జరిగాయి. 108 మంది విద్యార్థులు పాల్గొనగా.. 20 మంది విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం. వసుంధర, పీడీ గోపాలురెడ్డి, యోగా ట్రైనర్ తిరుపతయ్య తెలిపారు. అండర్–14 బాలకల విభాగంలో బి.జయశ్రీ (శింగనమల), బి.నవ్యశ్రీ (శింగనమల), ఎం.ప్రవల్లిక (బీకేఎస్), ఎం.భవ్యశ్రీ (శింగనమల), వై.విహార (నార్పల), బాలుర విభాగంలో జీ.చైతన్య కుమార్ (శింగనమల), ఆర్.త్రినాథ్ (శింగనమల), బి.జశ్వంత్ రెడ్డి (శింగనమల), వై.రాఘవ (శింగనమల), ఎం.హేమంత్‌కుమార్ (శింగనమల), అండర్–17 బాలకల విభాగంలో బి.తేజశ్విని (శింగనమల), కే.నందని (బీకేఎస్), ఏ.నిఖిత (బీకేఎస్), ఎస్.ధనుషా (నార్పల), కే.నవ్య (యల్లనూరు), బాలుర విభాగంలో పి.వెంకయ్య నాయుడు (శింగనమల), పి.నందకృష్ణ (శింగనమల), ఎం.శివకుమార్ (శింగనమల), ఎసీ.వి.వంశీకృష్ణ నాయక్ (బీకేఎస్), ఎం.భరత్‌కుమార్ (బీకేఎస్) ఎంపికయ్యారు.

సంక్షిప్త సమాచారం

చేపల మార్కెట్ వేలం రద్దు

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన చేపల మార్కెట్ వేలం రద్ద అయినట్లు మున్సిపల్ కమిషనర్ జి.రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన ఈ వేలం పాటను కొన్ని అనివార్య పరిపాలన కారణాల వల్ల రద్దు చేశామని పేర్కొన్నారు. తదుపరి వేలం నిర్వహణ తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

తక్షణ సాయం అందజేత

పామిడి: అనుంపల్లి గ్రామానికి చెందిన ముంటిమడుగు సూరి ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద సోమవారం మృతుడి భార్య సుజాతకు రూ.10 వేల తక్షణ సాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచ్ నారాయణ స్వామి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శర్మాస్, వలంటీర్లు పాల్గొన్నారు.


గర్భగుడి నిర్మాణానికి విరాళం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయ గర్భగుడి పునర్ నిర్మాణానికి సోమవారం గడ్డాలే నరసింగ రావు దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం

పామిడి: ఎంపీపీగా రెండేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగిడిన ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డిని ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ మండల నాయకులు, రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎం.కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రమణారెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు ఈవోఆర్డీగా నరసింహులు



గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండల ఈవోఆర్డీగా నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈవోఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న బారన్ సాహెబ్‌కు కొత్తచెరువు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈయన స్థానంలో విజయవాడ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయంలో పని చేస్తున్న నరసింహులు గుంతకల్లు ఈవోఆర్డీగా పదోన్నతిపై వచ్చారు.

వృద్ధురాలిపై కుక్క దాడి

గుత్తి: పట్టణంలోని గోపాలం బావి వద్ద సోమవారం నడుచుకుంటూ వెళుతున్న నారాయణమ్మ అనే వృద్ధురాలిపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. వృద్ధురాలిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.

మోస్తరు వర్షపాతం నమోదు

శింగనమల: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. శింగనమల మండలంలో 44.6 మి.మీ, యల్లనూరు మండలంలో 29.6 మి.మీ, నార్పల మండలంలో 21.4 మి.మీ, పుట్లూరు మండలంలో 18.4 మి.మి, బుక్కరాయసముద్రం మండలంలో 16.2 మి.మి, గార్లదిన్నె మండలంలో 8.6 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఓపీఎస్ అమలు చేయాలి

గుత్తి: ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎంప్లాయిస్ సంఘ డివిజనల్ సెక్రెటరీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. గుత్తి ఆర్ఎస్‌లోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎంప్లాయిస్ సంఘ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే సొసైటీ ఎన్నికల్లో అందరూ కష్టపడి విజయం సాధించాలన్నారు. అయితే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మనం కొంత వరకు వెనకబడి ఉన్నామన్నారు. ముందుకెళ్లడానికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఎంపాయీస్ సంఘ డివిజనల్ ప్రెసిడెంట్ బాబు, బ్రాంచ్ సెక్రెటరీ సుభాష్ బాబు, బ్రాంచ్ చైర్మన్ సుధాకర్, ట్రెసరర్ వేణుగోపాల్, డివిజనల్ డిప్యూటీ సెక్రెటరీలు డీఎస్ రెడ్డి , మల్లికార్జున, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మెయిన్స్‌కు గడువు పెంచాలని వినతి

గుంతకల్లుటౌన్: ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు గడువు పెంచాలని ఆర్డీఓ రవీంద్రను డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, దాసరి చరణ్ తదితరులు ఆర్డీఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

రైతుకు పాముకాటు

గుత్తి: మండల పరిధిలోని గొందిపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే రైతు సోమవారం పాము కాటుకు గురయ్యాడు. వివరాలు.. నాగిరెడ్డి గ్రామ శివారులో పొలంలో పనులు చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు అతడ్ని హుటాహుటిన గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

జేసీ నాగిరెడ్డి కాంప్లెక్స్ ఏ నిధులతో నిర్మించారు?

పెద్దపప్పూరు: టీడీపీ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించిన జేసీ నాగిరెడ్డి కాంప్లెక్స్ గదులను ఏ నిధులతో కట్టారు? వాటి వివరాలను తమకు వెల్లడించాలని జైభీం భారత్ పార్టీ తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరాజు సోమవారం స్పందనలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని తెలిపారు. 5 గదులకు అద్దె ఎవరు తీసుకుంటున్నారరో చెప్పాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ రామకృష్ణను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా.. ఆ కాంప్లెక్స్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి రికార్డులు తమ వద్ద లేవని సమాధానమిచ్చారు.

‘స్పందన‘కు రెండు అర్జీలు

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు వచ్చినట్లు తహసీల్దారు సుమతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు ఒకటి, కొత్త రేషన్ కార్డు కోసం ఒక్క అర్జీ వచ్చినట్లు తెలిపారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

యల్లనూరు: స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద సోమవారం గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని నిర్వహించారు. ఎంఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన పాటలతో అభిమానులను మంత్రముగ్ధులను చేశారన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయుడు శ్రీరంగయ్య పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: సంగీత ప్రపంచంలో రారాజుగా వెలుగొందిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని ఎస్పీ బాలు అభిమాన సంఘం నాయకులు కొనియాడారు. సోమవారం సాయంత్రం స్నేహ భారతి సంగీత శిక్షణాలయంలో ఎస్పీ బాలు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీధరరావు, డి.మహేశ్వరశర్మ, నాగమల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలస్వామి, నాయుడు పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక పద్మశ్రీ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి నిర్వహించారు. ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సీ.రామాంజినేయులు, కార్యదర్శి బి.సత్యనారాయణ, కోశాధికారి మరళి పాల్గొన్నారు.

తాగునీటికి 350 క్యూసెక్కుల నీరు విడుదల



మిడ్ పెన్నార్ దక్షిణ కాలువకు నీరు విడుదల చేసిన దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని మిడ్ పెన్నార్ డ్యాం నుంచి సోమవారం తాగునీటి కోసం దక్షిణ కాలువకు నీరు విడుదల చేసినట్లు హెచ్చెల్సీ ఏఈ సురేంద్ర పేర్కొన్నారు. తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో రోజూ మిడ్ పెన్నార్ డ్యాంకు 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, సౌత్ కెనాల్‌కు 350 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందన్నారు. ప్రస్తుతం మిడ్ పెన్నార్ డ్యాంలో 1.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 14న జిల్లా సాగునీటి సలహా మండలి తీర్మానం మేరకు మొదటి ప్రాధాన్యతగా తాగునీటి అవసరాలకు మిడ్ పెన్నార్ దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటి విడుదల చేయడం జరిగిందన్నారు. పుట్లూరు, కోమటికుంట్ల, గురుకు చింతలపల్లి చెరువులకు దాదాపు 30 రోజులు పాటు నీరు అందిస్తున్నామన్నారు. అలాగే నీటి లభ్యతను బట్టి దక్షిణ కాలువ ద్వారా ఆయకట్టుకు నీరు అందిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు మాత్రమే నీరు విడుదల చేశామన్నారు.